ఎన్నికల బాండ్ల వివరాలు ఎస్‌బిఐ ప్రకటించాలి

11న సిపిఎం ఆధ్వర్యంలో స్టేట్‌బ్యాంకు ఎదుట నిరసన

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని, గత నాలుగేళ్ళలో అమ్మినబాండ్లు, వాటిని కొన్నవారి సమస్త సమాచారాన్ని ఎన్నికల సంఘానికి మార్చి 6లోగా అందించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో ఎస్‌బిఐ విఫలమైందని సిపిఎం జిల్లా కార్యదర్శి వి. రాంభూపాల్ విమర్శించారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని, గత నాలుగేళ్ళలో అమ్మినబాండ్లు, వాటిని కొన్నవారి సమస్త సమాచారాన్ని ఎన్నికల సంఘానికి మార్చి 6లోగా అందించాలని ఈసీ ఆ వివరాలను మార్చి 13లోగా బహిర్గతపరచాలని సుప్రీంకోర్టు తన తీర్పులో ఆదేశించిందన్నారు. ఈ సమాచారాన్ని ఇవ్వడానికి సుప్రీంకోర్టు ఎస్‌బిఐకి మూడు వారాల గడువు ఇచ్చిందన్నారు. గడువు ముగిసే వరకు మౌనంగా ఉన్న ఎస్‌బిఐ మరో 116 రోజులు అదనపు గడువు కావాలని కోర్టును ఆశ్రయించడం కోర్టు ధిక్కార మన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను భ్రష్టు పట్టించిన ఎన్నికల బాండ్ల విధానం వల్ల బిజెపి అత్యధికంగా లాభపడిందన్నారు. రానున్న ఎన్నికలు ముగిసేవరకు ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించకుండా బిజెపి ఎస్‌బిఐ ద్వారా పన్నాగం పన్నినట్టు స్పష్టమవుతోందన్నారు. తన కార్యకలాపాలన్నింటినీ డిజిటలైజ్ చేసిన ఎస్‌బిఐ ఎన్నికల బాండ్లకు సంబంధించిన వివరాలను కోర్టు చెప్పిన మూడు వారాల్లో ఇవ్వలేక పోయిందంటే నమ్మశక్యంగా లేదన్నారు. మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఒత్తిళ్ల కారణంగానే ఎస్‌బిఐ ఈ వైఖరి తీసుకుందని విమర్శించారు. ఇప్పటికైనా ఎన్నికల బాండ్లకు సంబంధించిన వివరాలన్నీ ఎస్‌బిఐ అందచేసేలా సుప్రీం కోర్టు చర్యలు తీసుకోవాలని సిపిఎం కోరుతోందన్నారు. ఎస్‌బిఐ వైఖరిని నిరసిస్తూ వెంటనే ఎన్నికల బాండ్ల వివరాలు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మార్చి 11న ఎస్‌బిఐ బ్రాంచీల వద్ద నిరసన కార్యక్రమాలు చేయాలని సిపిఎం నిర్ణయించినట్లు వి రాంభూపాల్ తెలిపారు.

అపార సంపదలున్నా.. సమస్యలే..!

అభివృద్ధికి ఆమడదూరంలో రాయదుర్గం

పట్టించుకోని ప్రభుత్వాలు, పాలకులు

ఎన్నికల హామీలకే పరిమితమైన అభివృద్ధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో కర్నాటక సరిహద్దుల్లో ఉండే రాయదుర్గం నియోజకవర్గంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. రాష్ట్రంలోనే ఎక్కడాలేనంతగా అపారమైన ఖనిజ సంపదలున్నా అభివృద్ధికి మాత్రం ఆమడదూరంలోనే ఉంది. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా అక్కడి ప్రజల పేదరికం, దారిద్ర్యం మాత్రం మారడం లేదు. ఉపాధి కోసం పొట్టచేతపట్టుకుని పక్క రాష్ట్రానికి వలసలు తప్పడం లేదు. ఎన్నికల సమయంలో మాత్రం ప్రతిసారీ హామీలపై హామీలు వస్తూనే ఉన్నాయి.



రాయదుర్గం నియోజకవర్గంలోని ఖనిజ సంపద

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

కనిపించని కుదురేముఖ్

రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని డీ.హీరేహాళ్ మండలంలో అత్యంత విలువైన ఇనుప ఖనిజం ఉంది. ఈ ఖనిజాన్ని దోపిడీ చేసి వేల కోట్ల రూపాయలకు అధిపతులైన వారు కళ్లముందే ఉన్నారు. కాని ఈప్రాంతవాసులకు చేకూరిన ప్రయోజనం మాత్రం శూన్యమనే చెప్పాలి. ఈ ఖనిజ సంపద ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి కాకుండా ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని జిల్లావాసులు కోరుతున్నారు. అందుకు అనుగుణంగా 2012లో ఎపిఎండిసి, రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్, కుదురేముఖ్ మూడు ప్రభుత్వ రంగ సంస్థలు కలిపి ఈ ఇనుప ఖనిజాన్ని తవ్వి ఉక్కు గుండ్లను తయారు చేయాలని నిర్ణయించి, ఒప్పందం జరిగింది. దీని ఏర్పాటు పూర్తయితే మూడు వేల మందికి ఉపాధి లభిస్తుందని కూడా ఆ ఒప్పంద సమయంలో ప్రకటించారు. మూడు సంస్థలు ప్రభుత్వరంగ సంస్థలు కావడంతో దోపిడీకి అవకాశం లేకుండా ప్రజలకు మంచి జరుగుతుందని ఆశించారు. కాని ఆ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అటకెక్కింది. ఇప్పటి వరకు దాని గురించి పట్టించుకున్న వారు లేరు. పైగా ఇప్పుడు ఆ ఇనుప గనులను జిందాల్ సంస్థకు కట్టబెట్టేందుకు వైసిపి ప్రభుత్వం చర్యలు చేపడుతుండటం గమనార్హం.

కాగితాలకే పరిమితమైన ఉంతకల్లు రిజర్వాయరు

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ కింద కణేకల్ చెరువుకు పై భాగంలో నీటిని నిలువ చేసేందుకు ఐదు టిఎంసిలతో ఉంతకల్లు రిజర్వాయరును నిర్మించే ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది. ఇది కూడా 2014 తరువాత టిడిపి హయాంలో ప్రకటన అయింది. డిపిఆర్‌కు ఆదేశాలిచ్చామని ప్రకటించారు. కాని పూర్తవలేదు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా ముందుకు సాగలేదు. దీంతో ఉంతకల్లు రిజర్వాయర్ కూడా ఎన్నికల హామీ ప్రకటనలాగానే ఉండిపోయింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే నీరు ఎక్కువ వచ్చిన సమయంలోగాని, తక్కువగానున్న సమయంలోగాని రాయదుర్గం నియోజకవర్గం పరిధిలోని ఆయకట్టుకుని నీటిని నిలువ చేసుకుని పంటలకు నీటిని అందించేందుకు అవకాశముంటుంది. కాని రెండు ప్రభుత్వాల హయాంలోనూ ఇది ప్రకటనలకే పరిమితమైంది.

ఆగని వలసలు

పాలకులు మారుతున్నా ఈ ప్రాంతవాసులకు ఉపాధి కోసం వలసలు తప్పడం లేదు. స్థానికంగా పది మందికి ఉపాధి కల్పించే పరిశ్రమ ఏదీ లేకపోవడంతో వలసలు అధికంగా ఉంటున్నాయి. సాగునీటి వసతివున్నా నిర్వహణపై పాలకులు దృష్టి సారించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఈ నియోజకవర్గంలోని కణేకల్, బొమ్మనహాళ్ మండలాల్లో పోతున్నా ఆధునీకరణ అర్ధాంతరంగా ఆపడంతో ఆయకట్టు రైతులకు ఇబ్బందులున్నాయి. ఇప్పటికైనా ఈ ప్రాంతాభివృద్ధిపై పాలకులు నిర్దిష్టమైన ప్రణాళికలను విడుదల చేయాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

అటకెక్కిన భైరవానితిప్ప ప్రాజెక్టు

ఈ నియోజకవర్గం పరిధిలోనున్న భైరవాని తిప్ప ప్రాజెక్టుకు హంద్రీనీవా ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటిని అందిస్తామని 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రకటించి టెండర్లు ఆహ్వానించింది. పనులు మొదైలనప్పటికీ వారి హయాంలో పూర్తి చేయలేకపోయారు. 2019 ఎన్నికల సమయంలో ఈ ప్రాజెక్టును తాము పూర్తి చేస్తామని వైసిపి ప్రకటించింది. అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి రాయదుర్గం వచ్చిన సమయంలోనూ హామీనిచ్చారు. కాని ఆచరణలో మాత్రం పనులు ముందుకు సాగలేదు. నీరు చేరలేదు.

టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలుపుతున్న ముస్లిములు

ఢిల్లీలో ముస్లిములపై దాడి అమానుషం

ఆవాజ్ ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఢిల్లీలో నమాజ్ చేస్తున్న ముస్లిములపై పోలీసులు బూట్ కాలితో తన్ని దాడి చేయడం అమానుషమని ఆవాజ్ నాయకులు అన్నారు. దాడిని నిరసిసూ శనివారం నగరంలోని టవర్‌క్లావ్ వద్ద ఆవాజ్, మైనార్టీ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆవాజ్ నాయకులు మాట్లాడుతూ దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఇంద్రలోక ప్రాంతంలో నమాజ్ చేస్తున్న ముస్లిములపై కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పోలీసులు బూట్ కాళ్లతో కొట్టడం బాధాకరమన్నారు. వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వలి, ముస్కిన్ మసూదు, ఇర్ఫాన్, జాఫర్, బాబు, ఇస్మాయిల్, ఇమామ్, బాషా, ఎస్.కె, ఆజం, షౌకత్‌ఖాన్, బాషా జాంగిర్, నూర్‌బాబా, షేక్షా, మసూద్, ఫిరోజ్, గరీబ్ జిలాన్, దాదు, ఐఎంఎం బాషా, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ టికెట్ కోసం ఆనంద్‌రాజు దరఖాస్తు

ఉరవకొండ: నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ తనకు ఇవ్వాలని విడపనకల్లు మండల పరిధిలోని పాల్తూరు గ్రామానికి చెందిన ఆనందరాజు కోరారు. ఈమేరకు శుక్రవారం విజయవాడలోని ఆంధ్ర రత్న భవన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిలను విన్నవించారు. ఈ సందర్భంగా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఉరవకొండ నియోజకవర్గం పరిధిలో ఆరుగు అభ్యర్థులు పోటీలో ఉన్నారని, వారిపై సర్వే చేస్తే నియోజకవర్గంలో ఓటు శాతం నాకే ఎక్కువగా ఉందని వివరించారు. మీరు అవకాశం కల్పిస్తే నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తరపున ప్రచారం చేసి విజయానికి కృషి చేస్తానన్నారు.

షర్మిలతో ఆనందరాజు

చంద్రబాబు రాజకీయ వికలాంగుడు

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - రాయదుర్గం

టిడిపి నాయకుడు చంద్రబాబు నాయుడు రాజకీయ వికలాంగుడని వచ్చే ఎన్నికల్లో గెలుపుపై అగరొత్తుల మాదిరి బిజెపి, జనసేనతో పొత్తులకు వెంపర్లాట ఆడుతున్నారని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శించారు. శనివారం రాయదుర్గంలో వైసిపి అసెంబ్లీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి నివాసం వద్ద జరిగిన నియోజకవర్గస్థాయి వైసిపి కార్యకర్తల సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు తన పాలనలో గుర్తించబడే ఏ ఒక్క పని చేయలేదన్నారు. అయితే జగన్మోహన్ రెడ్డి పేరు చెబితే అనేక సంక్షేమ పథకాలు గుర్తుకు వస్తాయన్నారు. చంద్రబాబు చెప్పే సూపర్ సిక్స్ అమలు చేయాలంటే రెండున్నర లక్షల కోట్ల రూపాయల నిధులు అవసరం అన్నారు. చంద్రబాబు గత ఎన్నికలలో 600 హామీలు, 100 పేజీల మేనిఫెస్టోను ప్రకటించి అనంతరం దానిని వెబ్‌సైట్ నుంచి అదృశ్యం చేశారని అన్నారు. అయితే జగన్మోహన్ రెడ్డి చెప్పినవి చేయడమే కాక చెప్పనివి కూడా చేసి ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని అన్నారు. జగన్మోహన్ రెడ్డికి చంద్రబాబుకు గల సామీప్యం సారూప్యం నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. రాయదుర్గం అసెంబ్లీ అభ్యర్థి మెట్టు గోవింద రెడ్డి మాట్లాడుతూ రెండోసారి జగన్‌ను సీఎంగా చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో గార్మెంట్ పరిశ్రమలో పనిచేయు కార్మికులకు రాయితీపై విద్యుత్ సరఫరా చేయాలని, రైతులకు లాభదాయకంగా ఉన్న వెదురు పంట సాగుకు చేయూతనివ్వాలని అన్నారు. సోలార్ ప్లాంట్ల ఏర్పాటు వల్ల నియోజకవర్గంలో రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ చేసిన అభివృద్ధి, సంక్షేమం వల్ల ప్రజలు మరోసారి ఆయనను సిఎంగా గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యకర్తలు 45 రోజులపాటు కష్టపడి ఎమ్మెల్యేగా గోవిందరెడ్డిని, ఎంపీగా శంకర్ నారాయణను గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. వైసిపి పార్లమెంట్ అభ్యర్థి శంకర నారాయణ మాట్లాడుతూ వైసిపికార్యకర్తలకు ఎన్నికలలో దశ దిశ నిర్దేశనం చేసేందుకు సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో వైసిపి ఎన్నికల పరిశీలకులు పామిడి వీరాంజనేయులు, ఎంఆర్‌సి రెడ్డి, జిల్లా పరిషత్ అధ్యక్షులు బోయ గిరిజమ్మ ఎమ్మెల్సీ మంగమ్మ, ఎడిసిసి బ్యాంక్ అధ్యక్షులు లిఖిత, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు భోజరాజు నాయక్, మాజీ అధ్యక్షులు ఉషారాణి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేంద్ర రెడ్డి, జెడ్పిటిసి హసీనా బేగం, మల్లికార్జున, పద్మావతి, పార్టీ మండల కన్వీనర్లు వన్నూరు స్వామి, లక్ష్మీకాంతరెడ్డి, రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పోరాలు శిల్ప, ఉపాధ్యక్షులు వలిబాషా, శ్రీనివాస్ యాదవ్‌తో పాటు వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాడీ వేడి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మార్చి ప్రారంభంలోనే వాతావరణం ఒక్కసారిగా వేడెక్కుతోంది. మొదటి వారంలోనే ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎండ వేడిమి 40 డిగ్రీలకు దాటింది. హిందూపురంలో ఒక మహిళ రేషన్‌షాపుకెళ్లి వడదెబ్బకు మృతి చెందింది. జిల్లాలో ఈ ఏడాది మొదటి వడదెబ్బతో మృతి చెందిన కేసుగా చెప్పవచ్చు. ఇంక ఏప్రిల్, మేల్లో ఇంతకెంత తీవ్రంగా ఎండ ఉంటుందో అని ఊహించుకుని జనం భయపడిపోతున్నారు. ఇదే సమయంలో ఎన్నికలు కూడా రావడంతో రాజకీయ వాతావరణం కూడా వేడెక్కుతోంది. ఇప్పటికే ఆయా పార్టీలు పోటీ చేసే స్థానాలతోపాటు ఇప్పటికే కొంత మంది అభ్యర్థులను ఖరారు చేసింది. ఈ ఖరారు చేసిన చోట అసంతృప్తులు, అలకలు ఒకవైపు ఉంటున్నాయి. ఈ వారంలో చూసినప్పుడు టిడిపి ఇటువంటివి కనిపించాయి. మడకశిర, కళ్యాణదుర్గం, శింగనమల నియోజకవర్గాల్లో అసంతృప్త నేతలు బాహాటంగా బయటకు తమ అసంతృప్తిని వ్యక్తం చేయడం చర్చనీయాంశమైంది. అయితే ఇదే సమయంలో జిల్లాలో ఒకవైపు టిడిపి నాయకురాలు భువనేశ్వరి నిజం గెలవాలి పేరుతో పర్యటన చేపట్టింది. ఇది ముగియక ముందే నారా లోకేశ్ జిల్లాకు వచ్చారు. శంఖారావం పేరుతో ఆయన పర్యటన చేపడుతున్నారు. ఆయన ఈ వారమంతా ఇక్కడే మకాం వేశారు. రోజుకు రెండు నియోజకవర్గాల కంటే ఎక్కువగానే పర్యటిస్తున్నారు. ఇదే సమయంలో అసంతృప్త నేతలతోనూ చర్చిస్తూ సమస్యను కొలిక్కి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో చాలా వరకు సర్దుబాటు దిశగా వస్తున్నట్టు తెలుస్తోంది. అయితే ఇది నేతల ముందు వరకేనా తరువాత కూడా ఉంటాయా అన్న అనుమానం కలుగుతోంది. ఇది ఇలాగుంటే టిడిపి ,జనసేన, బిజెపి పొత్తు అంశం రాజకీయ వేడిని మరింత పెంచుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనంతపురం, ధర్మవరం నియోజకవర్గాలకు పొత్తుల్లో భాగంగా టిడిపి వదులుకోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఆ నియోజకవర్గాల్లోనూ కొత్త సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇక కర్నూలు జిల్లా నాయకులు, మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం టిడిపిలో చేరడంతో ఆయన గుంతకల్లులో పోటీ చేస్తారన్న ప్రచారం నడుస్తోంది. దీంతో అక్కడా కొత్త అసంతృప్తులు మొదలయ్యాయి. ఇలా టిడిపిలో జరుగుతున్న పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. ఇక వైసిపి వేచి చూసే ధోరణే అవలంభిస్తోంది. ముందే అభ్యర్థుల ప్రకటన ప్రారంభించినప్పటికీ ఇప్పటి వరకు ఏడు నియోజకవర్గాల్లోనే పూర్తి చేసింది. ఇంకా సగం నియోజకవర్గాల్లో ప్రకటించాల్సుంది. ఇక్కడ ఎటువంటి మార్పులుండనున్నాయన్నది చర్చ నడుస్తోంది. ఏదైనా మార్పులు జరిగితే ఈ నియోజకవర్గాల్లోనూ అసంతృప్తులు మొదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ప్రకటించిన వాటిల్లోనూ వైసిపి మార్పు చేస్తుందన్న ప్రచారం నడుస్తోంది. ఇది ఎంతవరకన్నది తెలియదు. మొత్తంగా వాతావరణంతోపాటు రాజకీయ వేడి క్రమక్రమంగా పెరుగుతోంది. ఇది రాబోయే రోజుల్లో మరింతగా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇది ఇలాగుంటే సిపిఎం జిల్లా సమగ్రాభివృద్ధి అంశాన్ని ముందుకు తీసుకొచ్చింది. జిల్లా సమగ్రాభివృద్ధి ప్రణాళికను ఆయా పార్టీల నాయకులు, అభ్యర్థులకు అందజేస్తోంది. వ్యక్తిగతంగా అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి నాయకులకు, ఇతర పార్టీల ముఖ్యులకు కూడా ఈ ప్రణాళికను అందజేస్తోంది. ఈ అంశాన్ని అజెండాపైకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తోంది.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

ఆర్డీటీ కౌన్సిలర్ మేరీ సుజాత

కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి-ఉరవకొండ

నేటి సమాజంలో మహిళలు అన్నిరంగాల్లో రాణించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆర్డీటీ కౌన్సిలర్ మేరీ సుజాత పిలుపునిచ్చారు. శనివారం విడపనకల్ మండల కేంద్రం ఎస్సీ కాలనీలో ఉన్న ఆర్డీటీ పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్‌డిటి సంస్థ మహిళలకు ఎన్నో చైతన్యవంతమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ అన్నిరంగాల్లో ముందుకు రావాలని ప్రోత్సహిస్తోందన్నారు. మహిళలు బాగా చదువుకుని వాళ్ల ప్రతిభను గుర్తించే విధంగా అందరూ సహకరించాలని మహిళలు సాధించిన గొప్ప గొప్ప కార్యాలయం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో విడపనకల్ సిఓ యశోద, సిబిటిలు గడేకల్ భీమలింగ, వేల్పుమడుగు అంజనేయులు, విడపనకల్లు ఓంకారి, సుంకన్న, ఎంబి.చెన్నారాయుడు, బి.చంద్రకళ, ఎంబి.నాగలక్ష్మి, లక్ష్మీదేవి, ఆడిట్ సభ్యులు గ్రూప్ లీడర్లు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

రేపు నారా లోకేష్ శంఖారావం సభ

తాడిపత్రి రూరల్ : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన శంఖారావం యాత్ర సోమవారం తాడిపత్రిలో జరగనున్నట్లు టిడిపి నాయకులు తెలిపారు. ఈ మేరకు వారు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాడిపత్రి రూరల్ పరిధిలోని కడప రోడ్డు నందు శంఖారావం సభ ఏర్పాటు చేయబడుతుందని సభను విజయవంతం చేయాలని కోరారు.

గ్రామాలకే ప్రభుత్వ పాలన : ఎమ్మెల్యే పెద్దారెడ్డి

సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ప్రభుత్వ పాలనను గ్రామాలకే తీసుకొచ్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని జూటూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోనే అధికారులు ఉండి సమస్యలు పరిష్కరించాలన్న ఉద్దేశ్యంతోనే సిఎం జగన్ సచివాలయాలను ఏర్పాటు చేశారన్నారు. తద్వారా ఏసమస్య ఉన్నా మండల కేంద్రానికి వెళ్లకుండా, సమయం వృథా కాకుండా గ్రామాల్లోనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. దీనికితోడు వాలంటరీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే వెళున్నాయన్నారు. ఆయా ప్రభుత్వ పథకాల్లో అవినీతికి తావు లేకుండా పోయిందన్నారు. ప్రజలకు మంచి చేస్తున్నారు కాబట్టే ప్రతిపక్షాలు కూటములు కట్టుకుని వస్తున్నా జగనన్న మాత్రం సింగిల్‌గానే వస్తున్నారన్నారు. కాగా ఆయా పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైసిపికి ఓటు వేసి జగన్‌ను సిఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్‌రెడ్డి, జూటూరు రామ్మోహన్‌రెడ్డి, మాజీ మండలాధ్యక్షులు రామ్మూర్తిరెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు అమర్నాథ్‌రెడ్డి, తురకపల్లె లక్ష్మీరెడ్డి, నామినాగుపల్లి రఘునాథ్‌రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొంతానపల్లిలోఎన్ఎస్ఎస్ శిబిరం

ఆర్‌డిటి పాఠశాల పరిసరాలను శుభ్రం చేస్తున్న వాలంటీర్లు

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని కొంతానపల్లి గ్రామంలో కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథక యూనిట్-3 ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో శనివారం జాతీయ ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా ఏడు రోజులపాటు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నారాయణ తెలిపారు. ప్రత్యేక శిబిరం మా గ్రామంలో ఏర్పాటు చేయడం చాలా సంతోషదాయకమని, తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని సర్పంచి కాపు విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాలు చేస్తూ అన్నిరంగాల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఆర్డీటీ పాఠశాల పరిసరాల్లో ఉన్న చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు తాడప్ప, అధ్యాపకులు కోదండరాములు, గోవర్ధన్ సిద్దప్ప ,ప్రశాంత్, పాండు వాలంటీర్లు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లస్థలాలు పంపిణీ

తాడిపత్రి రూరల్ : ఫయాజ్ భాషా సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలోబీడీ కార్మికులు, ఇల్లు నిరుపేదలకు దాదాపు 240 ఇంటి స్థలాలను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఫయాజ్ భాష సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫయాజ్ భాషా చేస్తున్న సేవలు ఆదర్శనీయమన్నారు. తాడిపత్రి శాసనసభ్యులు కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట్లాడుతూ.. ఫయాజ్ భాష ఆధ్వర్యంలో ఇప్పటికే రెండు మూడుసార్లు తన చేతుల మీదుగా సేవా కార్యక్రమాలు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం పార్లమెంటు సమన్వయకర్త శంకర్ నారాయణ, వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

'శంఖారావం'ను విజయవంతం చేయండి

రాయదుర్గం : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని రాయల్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేయనున్న శంఖారావం సభను విజయవంతం చేయాలని టిడిపి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. నేడు ముందుగా కార్యకర్తలకు అభినందన సభ అనంతరం మూడు గంటల వరకూ టిడిపి కార్యకర్తలు వచ్చే ఎన్నికలో పార్టీ గెలుపు కోసం చేయాల్సిన కృషిపై దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. కావున ఆయా కార్యక్రమాల్లో టిడిపి నాయకులు, అనుబంధ విభాగాల సభ్యులు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, యూనిట్ ఇన్‌ఛార్జిలు బిఎల్ఎలు పాల్గొనాలని కోరారు.

ఉరవకొండ : ఉరవకొండ నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం జరిగే శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ కోరారు. ఈ సభలకు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం,జనసేన కుటుంబ సభ్యులు నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌చౌదరి

అనంతపురం కలెక్టరేట్ : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాల్గొనే శంఖారావాన్ని విజయవంతం చేయాలని వైకుంఠం ప్రభాకర్‌చౌదరి పిలుపునిచ్చారు. శనివారం అర్బన్ పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో ఆయన మాట్లాడుతూ ఈనెల 11న నగరంలోని పివికెకె కళాశాల (రుద్రంపేట) లో నిర్వహించే శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేద్దామన్నారు. కార్యక్రమంలో క్లస్టర్, యూనిట్, ఇన్చార్జులు, నాయకులు పాల్గొన్నారు

నేడు మహిళా దినోత్సవం

అనంతపురం : పద్మజ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు వార్షికోత్సవం సందర్భంగా నగరంలోని సుభాష్ రోడ్డులో ఉన్న టౌన్‌బ్యాంకు మూడో ఫ్లోర్‌లో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ట్రస్టు వ్యవస్థాపకురాలు పద్మజా ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు ఉదయం 10 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలను సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు.

12 నుంచి కెజిబివిల్లో ఆన్‌లైన్ అడ్మిషన్లు

పుట్లూరు : మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాలలో 6వ, 11వ తరగతుల్లో ప్రవేశం కోసం, 7, 8, 9వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎంఇఒ శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్ (బడి మానేసిన వారు) పేద, ఎస్.సి, ఎస్.టి, బిసి, మైనారిటీ, బి.పి. ఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 8004258599 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ప్రధానోపాధ్యాయులు నాగేష్‌కు ఉద్యోగోన్నతి

నార్పల : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న నాగేష్ జూనియర్ కళాశాల పీడీగా పదోన్నతి పొందారు. ఈయన ప్రస్తుతం ప్రభుత్వ బాలల పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయునిగా ప్రధానోపాధ్యాయునిగా పని చేస్తున్నారు. ప్రస్తుతం ఈయన పదోన్నతిపై కొత్తచెరువు జూనియర్ కళాశాలకు వెళ్తున్నారు. నార్పల ప్రభుత్వ పాఠశాలలో పీడీగా సుదీర్ఘకాలం సేవలను అందించి ఎందరో క్రీడాకారులను తీర్చిదిద్దిన ఆయనకు పలువురు స్థానికులు, శిష్యులు హృదయ పూర్వక అభినందనలు తెలిపారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

తాడిపత్రి రూరల్ : ముఖ్యమంత్రి సహాయ నిధి రూ.9లక్షల చెక్కులను 11 మందికి బాధితులకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి శనివారం పంపిణీ చేశారు. తాడిపత్రి పట్టణ, రూరల్ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 11 మంది బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్‌చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

పాల్తూరులో కాంగ్రెస్ ప్రచారం

ప్రజలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

విడపనకల్ మండల పరిధిలోని పాల్తూరులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామానాయుడుని గెలిపించాలని ఆ పార్టీ నాయకులతో కలిసి శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల వద్దకు వెళ్లి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని తన గెలుపుకు కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బడుగు, బలహీన వర్గాలు, సామాన్య ప్రజలకు సంక్షేమ పథకాల అందుతాయన్నారు. అంతకుముందు మండల పరిధిలోని 150 మంది చర్చి పాస్టర్లతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి పలు విషయాలు చర్చించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి సోనియా సీనా, ఏపీ యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పోసా రాము, విడపనకల్, కూడేరు మండలాల కన్వీనర్లు రాముడు, నారాయణస్వామి యాదవ్, నాయకులు హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

పదవుల కంటే కార్యకర్తలే ముఖ్యం

ధర్మవరం టౌన్ : పదవులు, భవిష్యత్తు కంటే నన్ను నమ్మి నా వెంట నడిచిన కార్యకర్తలే తనకు ముఖ్యమని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ధర్మవరంలో పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు నేను ఇక్కడికి వచ్చినప్పుడు ప్రతి నాయకుడు, కార్యకర్త నా వెంట ఉండి నడుస్తూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నారన్నారు. వైసిపి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అనేక రకాలుగా ధర్నాలు, ఆందోళనలు, దీక్షలు చేశారన్నారు. పోలీసులు అక్రమ కేసులు బనాయించినా భయపడకుండా నా వెంట నడిచారన్నారు. కావున మీ కోసం ధర్మవరంలో ఉంటూ అండగా ఉంటానన్నారు. ధర్మవరం బాధ్యతలను అప్పగించిన నారా లోకేష్‌పై తనకు నమ్మకం ఉందని, టిడిపి గెలుపే లక్ష్యంగా పని చేద్దామని పిలుపునిచ్చారు.

అంగన్వాడీ కార్యకర్తకు ప్రశంసా పత్రం

తలుపుల : విధి నిర్వహణలో భాగంగా చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతలకు మండలంలోని వేపమానిపేట సెక్టార్ ఉబ్బరవాండ్లపల్లి గ్రామానికి చెందిన అంగన్వాడీ కార్యకర్త సంజన అంకిత భావంతో ఉత్తమ సేవలు అందించింది. ఆమె సేవలకు గానూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐసిడిఎస్ పిడి లక్ష్మికుమారి సంజనకు ప్రశంసా పత్రం అందజేసింది. కార్యక్రమంలో సిడిపిఒ రాధిక, సూపర్వైజర్ నిహారిక, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

సిఏఏ అమలుకు బిజెపి కుట్ర

ఇన్సాఫ్ రాష్ట్ర కార్యదర్శి జాఫర్, జిల్లా కార్యదర్శి గోల్డ్ బాషా

మాట్లాడుతున్న ఇన్సాఫ్ రాష్ట్ర కార్యదర్శి జాఫర్

ప్రజాశక్తి-పామిడి

వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం సిఏఏ అమలు చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఇన్సాఫ్ రాష్ట్ర కార్యదర్శి జాఫర్, జిల్లా కార్యదర్శి గోల్డ్ బాషా ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలోని షాదీఖానాలో ఆల్ ఇండియా తంజీమ్ ఏ ఇన్సాఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఇన్సాఫ్ జిల్లా నాయకుడు రహీం అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో వారు మాట్లాడుతూ ముస్లిములను అన్యాయం చేసే సిఏఏ అమలు నిర్ణయాన్ని తక్షణమే కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. ఈ విషయంపై ప్రజాతంత్ర వాదులంతా కేంద్ర ప్రభుత్వ దూకుడు చర్యలను ఖండించాలన్నారు. సిఏఏ అమలు చేస్తే రాజ్యాంగంలోని లౌకికత్వానికి తూర్పారపట్టమే అన్నారు. ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్ దేశాల నుంచి అక్రమంగా వలస వచ్చిన ముస్లిమేతరులకు ఆశ్రయం ఇచ్చేందుకు ప్రతిపాదించిన సిఏఏ బిల్లుకు దేశవ్యాప్తంగా తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమైనప్పటికీ 2019లో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఏకపక్షంగా ఆమోదించిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి సిఏఏ చట్టం అమలు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముస్లిం మైనార్టీ నాయకులు జిక్రియా, బి.కె.రహీం, బారున్‌సాబ్, బి.కె.అన్వర్, సిపిఐ నాయకులు వీరభద్ర స్వామి, నాగరాజు, ముస్లిం మైనార్టీ సోదరులు, తదితరులు పాల్గొన్నారు.

జనసేన ప్రచార వాహనాలు ప్రారంభం

ప్రచార వాహనాలను ప్రారంభిస్తున్న జనసేన జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని రామ్‌నగర్‌లో ఉన్న జనసేన పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన 26 ప్రచార వాహనాలను ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్ శనివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వరుణ్ మాట్లాడుతూ కొట్టే వారి విజయ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రచార వాహనాలను జనసేన పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యులు నాగబాబు మంగళగిరిలో ప్రారంభించారన్నారు. ఈ వాహనాలు రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జనసేన పార్టీకి ఎంతో పట్టు ఉన్న అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఈ వాహనాలు ప్రవేశించడంతో జనసేన–టిడిపి ఉమ్మడి కార్యకర్తల్లో ఎంతో ఉత్సాహం నెలకొందన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గవ్యాప్తంగా అన్ని డివిజన్లలో ఈ వాహనాలు పర్యటిస్తాయన్నారు. జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే ఈ ప్రచార వాహనాల ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బాబురావు, అంకే ఈశ్వరయ్య, పత్తి చంద్రశేఖర్, కుమ్మర నాగేంద్ర, రాపా ధనుంజయ, కిరణ్‌కుమార్, జయమ్మ, అవుకు విజయకుమార్, ముప్పూరి కృష్ణ, మేదర వెంకటేష్, హుస్సేన్, లాల్‌స్వామి, రాజేష్ ఖన్నా, కుమ్మర మురళి, నాగార్జున, సంపత్, వల్లంశెట్టి వెంకటరమణ, ఆకుల అశోక్, నెట్టిగంటి హరీష్, మంగళ కృష్ణ, కలిమిశెట్టి వెంకటేష్ (పాములరాయి), సంతోష్, వీరమహిళలు అనసూయ, దాసరి సరిత, అంజలి, వర్షిత, నాయకులు విజయ్ భాస్కర్, నజీమ్, హరికృష్ణ, హరీష్, ఉదయ్, శిక్ష, వంశీ, విజయ్‌రాయల్, నౌషాద్, ఉదయ్, హరి సాయి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ ఫౌండేషన్ సేవలు వెలకట్టలేనివి

అభయ ఫౌండేషన్ స్థాపకులు స్వామి బాలచంద్ర

పురస్కారాలు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

ప్రజాశక్తి ఉరవకొండ

పది సంవత్సరాలుగా నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలు వెలకట్టలేనివని అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు స్వామి బాలచంద్ర పేర్కొన్నారు.శనివారం ఉరవకొండలోని సాయిబాబా దేవాలయంలో నిస్వార్థ ఫౌండేషన్ పదవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అంతకుముందు విద్యార్థులతో కలిసి ప్రధాన రహదారి మీదుగా అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి నిస్వార్థ ఫౌండేషన్ సంస్థ చేపట్టిన సేవా కార్యక్రమాలను వివరిస్తూ సంబరాలు జరుపుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలను నాటారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో వక్తలు మాట్లాడుతూ అభివృద్ధికి దోహదం చేసే ప్రధాన అంశాలపై నిర్విరామంగా ప్రచారం చేయడంతో పాటు సమావేశాలు నిర్వహించి అన్ని గ్రామాలలో సేవాగుణం పెంపొందించుకునేలా మార్గదర్శకంగా నిలవడం నిస్వార్థ ఫౌండేషన్ సభ్యులకే దక్కిందన్నారు. నాలుగు ఎనిమిది పదవ తరగతి పాసైన విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ ఏర్పాటు చేయడంతో పాటు పర్యావరణం పై బాధ్యత పెరిగేలా విద్యార్థులను ప్రభావితం చేశారని కొనియాడారు. విద్యార్థి దశలోనే మొక్కలు నాటి వాటిని పరిరక్షించినందుకు పర్యావరణ మిత్ర పురస్కారం అవార్డులను విద్యార్థులకు అందజేశారు. అనంతరం పాత్రికేయులను పౌర పాత్రికేయ సేవా పురస్కారం అవార్డులతో సన్మానించి అభినందించారు.ఈ కార్యక్రమంలో నిస్వార్థ ఫౌండేషన్ వ్యవస్థాపకులు తాటికొండ వెంకట్ గురూజీ, జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు, ప్రకతి ధర్మపీఠం వ్యవస్థాపకులు శ్రీనివాస్, నిస్వార్థ అభయ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి, బిజెపి, జనసేన పొత్తుతో ఒరిగేదేమీ లేదు : మంత్రి

ప్రజాశక్తి -పెనుకొండ

నాడు మోదీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేసిన చంద్రబాబు నేడు బిజెపితో జత కట్టడంపై రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. మంత్రి శనివారం పట్టణంలోని 9వార్డులో ఆత్మీయ పలకరింపు కార్యక్రమం చేపట్టారు. ముందుగా మంత్రికి వైసిపి శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఆమె వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించా రు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ మోదీతో పొత్తు పెట్టు కుంటున్నాడండే చంద్రబాబు ఉనికి ఎక్కడ అని ప్రశ్నించారు. పొత్తులో భాగంగా పవన్ కళ్యాణ్‌ని ఎంపిగా పంపిస్తున్నారంటే చంద్రబాబు కుట్ర రాజకీయాలు ఏస్థాయిలో ఉన్నాయో అర్థమవుతాయన్నారు. సిఎం పదవికి అడ్డం వస్తాడేమోనని భయంతోనే ఆయన్ను ఎంపికి పంపుతున్నరని, ఆ విషయాన్ని పవన్ కళ్యాణ్ అర్థం చేసుకోవాలని హితవు పలికారు. టిడిపి, జనసేన, బిజెపి ఏకమై వచ్చినా జగన్ సింగిల్‌గా వస్తారని తెలిపారు. ప్రతి గడపలో వైసిపికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. పూర్తి మెజారిటీతో మరోమారు జగన్ సిఎం అవుతారన్నారు. జగన్ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారని, చంద్రబాబు తన పాలనలో ఏమి చేశారో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. పెనుకొండలో జరిగిన చంద్రబాబు, లోకేష్ సభలకు జనాలు లేక ఫెయిల్యూర్ అయ్యాయన్నారు. పొత్తులతో చంద్రబాబుకు ఒరిగేదేమీ లేదని, వార్ వన్ సైడ్ అన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ ఉమర్‌ఫరూక్, వైస్ ఛైర్మన్ సునీల్, కౌన్సిలర్ శ్రీరాములు, సుధాకర్‌రెడ్డి, గణేష్, రఘునాథరెడ్డి, తయూబ్, బోయ బాబు, సద్దాం, శేషాద్రి, రామంజి, యాసిన్, టౌన్ కన్వీనర్ నరసింహా, నాయకులు శంకర్‌రెడ్డి, కొండల రాయుడు, వెంకటేష్, గోపాల్, రాజశేఖర్‌రెడ్డి, ఆంజనేయులు, నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రఘువీరా పర్యటనను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మడకశిర

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో త్వరలోనే సిడబ్ల్యుసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పర్యటిస్తారని విజయవంతం చేయాలని డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సుధాకర్ పిలుపునిచ్చారు. స్థానిక శ్రీలక్ష్మీ నరసింహస్వామి కమ్యూనిటీ భవనంలో శనివారం పార్టీ మండల అధ్యక్షుడు డాక్టర్ గౌడప్ప ఆధ్వర్యంలో మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథి సుధాకర్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీని గెలిపిస్తే మడక శిరకు పూర్వ వైభవం వస్తుందన్నారు. నిలిచిపోయిన అభివృద్ధి పనులు, రైల్వేలైన్, రైతులకు హంద్రీనీవా కాలువ ద్వారా సాగునీరు, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వం 1600 ఎకరాల భూమిని రైతుల నుంచి కొనుగోలు చేసిందని, అయితే గత పదేళ్లలో టిడిపి, వైసిపి ప్రభుత్వాలు ఒక్క పరిశ్రమ కూడా నెలకొల్పలేదన్నారు. అది పూర్తి కావాలంటే రఘువీరారెడ్డితోనే సాధ్యమని, కావున ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీకి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బిఎన్.నరసింహమూర్తి, ప్రభాకర్‌రెడ్డి, అన్వర్, సతీష్, జగన్నాథ్, పాండురంగారెడ్డి, రామకృష్ణారెడ్డి, దాసేగౌడ్, శ్రీరంగప్ప, ముద్దప్ప, రాయుడు, సన్నదాసప్ప, శేషాద్రి పాల్గొన్నారు.

టిడిపి, జనసేన బిసి డిక్లరేషన్‌పై హర్షం

మడకశిర : అన్ని రంగాల్లో వెనుకబడ్డ కుంచిటి వక్కలిగల అభివృద్ధి కోసం టిడిపి, జనసేన ఉమ్మడి పార్టీలు ఉమ్మడిగి బిసి డిక్లరేషన్ ప్రకటించడం హర్షణీయమని రాష్ట్ర కుంచిటి వక్కలిగ సాధికారత సమితి అధ్యక్షులు వీఎం పాండురంగప్ప హర్షం వ్యక్తం చేశారు. రొళ్ల మండలంలోని వన్నారన్నపల్లి అధ్యక్షులు నివాసం ఆవరణలో శనివారం నియోజకవర్గంలోని కుంచిటి వక్కలిగలు సమావేశమయ్యారు. పాండు రంగప్ప మాట్లాడుతూ టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం వస్తే కుంచిటి వక్కలిగలను ఒబిసి జాబితాలోకి చేర్పించడం, యువత ఉపాధి కోసం పరిశ్రమలు ఏర్పాటు చేయడం, స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాల ద్వారా శిక్షణ, బిసి డిక్లరేషన్ ప్రకటించడం శుభపరిణామమన్నారు. బిసి డిక్లరేషన్ ప్రకటనతో సిఎం జగన్ గుండెల్లో రైళ్లు పరుగెత్తడం ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో వీరాక్యాతరాయ, ఉగ్రనరసింహా, జయరాంరెడ్డి, టిడి పల్లి మంజునాథ్‌గౌడ్, జయరామప్ప, రామన్న, రవికుమార్, రామచంద్రప్ప, తిమ్మేగౌడ, హనుమంతరాయ, డైరెక్టర్లు,తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల ద్వారా గ్రామాభివృద్ధి

ప్రజాశక్తి-బుక్కపట్నం

సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని సిద్ధరాంపురం గ్రామంలో రూ. 43 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సచివాలయాల ద్వారానే సాధ్యమవుతుందన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. వైసిపి ప్రభుత్వం గ్రామ సచివాలయాల ద్వారా ప్రజా పాలన సాగిస్తుందని తెలిపారు. అనంతరం ఆర్‌బికె, విలేజ్ హెల్త్ క్లినిక్‌ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచి వెంకట రమణయ్య, ఎంపిపి శ్రీధర్‌రెడ్డి, జిల్లా అగ్రి అడ్వైజరీ ఛైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, కన్వీనర్ సుధాకర్ రెడ్డి, ఎంపిటిసి చెన్నమ్మ, మల్లేష్, కేశప్ప, మాధవరెడ్డి, నేలకోటప్ప పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తల మృతికి సంతాపం

కదిరి టౌన్ : పట్టణంలోని మూర్తిపల్లికి చెందిన బేతే సురేంద్రనాయుడు గుండెపోటుతో మృతి చెందగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ శనివారం వారి ఇంటికి వెళ్లి మృతదేహానికి నివాళు లర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూరల్ మండలంలోని పట్నం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త కృష్ణప్ప హఠాణ్మరణం చెందడంతో వారి ఇంటికి వెళ్లి మృతదేహానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గుండెపోటుతో మున్సిపల్ ఉద్యోగి మృతి

మృతిచెందిన హరినాథరెడ్డి

రాయదుర్గం : రాయదుర్గం పురపాలక సంఘంలో ఇంజినీరింగ్ విభాగంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న హరినాథరెడ్డి (58) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. తాగునీటి సరఫరా చేసే ట్యాంకరును తీసుకొస్తుండగా అస్వస్థతకు గురై గుండెపోటుకు వచ్చింది. వెంటనే తోటి సిబ్బంది సమాచారం తెలుసుకుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. హరినాథ్‌రెడ్డి మృతి పట్ల మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, పాలకమండలి ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

సంక్షేమ పాలన జగన్‌తోనే సాధ్యం

వృద్ధురాలికి నమస్కరిస్తున్న వీరాంజనేయులు

గార్లదిన్నె : ప్రజలకు సంక్షేమ పాలన అందాలంటే ఆది ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తోనే సాధ్యమని శింగనమల నియోజకవర్గం సమన్వయకర్త వీరాంజనేయులు అన్నారు. శనివారం గార్లదిన్నె, జంబులదిన్నె, కొట్టాల గ్రామాలలో స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు నరేందర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

పెనుకొండ : పట్టణంలో వెలసిన బాబయ్యస్వామి దర్గా పీఠాపతి తాజ్‌బాబా, కాబోయే పీఠాధిపతి నజర్ హుస్సేని ఆధ్వర్యంలో డాక్టర్ సయ్యద్ తౌఫీరా తబస్సుమ్ అధ్యక్షతన బెంగళూరుకు చెందిన సప్తగిరి హాస్పిటల్ సహకారంతో శనివారం పట్టణంలోని దర్గాపేటలో పెద్ద దివాన్ ఖానా వద్ద ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో గుండె, న్యూరో సర్జరీ, కిడ్నీ స్టోన్, క్యాన్సర్ సంబంధింత వ్యాధులకు వైద్య సేవలందించి మందులు ఇచ్చారు. 20 మందిని శస్త్రచికిత్స కోసం బెంగళూరుకు రెఫర్ చేశారు. శిబిరంలో జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా, హిందూపురం పట్టనానికి చెందిన టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారుఖ్ ఖాన్, బాబా, అహ్మద్ హుస్సేన్, షేక్షా, జింకా నూర్, దాదు, ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మరథోత్సవం

లేపాక్షి : మహాశివరాత్రి బ్రహ్మరథోత్సవంలో భాగంగా శనివారం లేపాక్షిలో శివపార్వతులకు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆ తరువాత స్వామి అమ్మవారు ఉత్సవ విగ్రహాల ను రథంలో కొలువుదీర్చి పుర వీధుల్లో ఊరేగించారు. ఊరేగింపులో కేరళ కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. భక్తులు స్వచ్ఛందంగా భోజనాలు, మజ్జిగ, నీరు అందించారు. కార్యక్రమంలో సిఐ ఈరన్న, ఎస్ఐ గోపి, ఆలయ కమిటీ ఛైర్మన్ రమానందం, ఇఒ నరసింహమూర్తి, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

పెనుకొండ : పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శనివారం పరిగి మండలంలోని శ్రీరంగరాజు పల్లి, పాపిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన 13 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలోకి చేరాయి. వారికి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ టిడిపి కండువా వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో భాస్కర్, మారు తి, సురేష్, వెంకటేష్, సోమన్న, జి.వెంకటేష్, జయశంకర్, గంగప్ప, శ్రీరాములు, గణేష్, నవీన్, సిద్ధప్ప, రామాంజనేయులు ఉన్నారు. కార్యక్రమంలో పరిగి మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

12న మెగా జాబ్‌మేళా

పుట్టపర్తి అర్బన్ : నిరుద్యోగ యువత కోసం ఈ నెల 12వ తేదీ బుక్కపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్య అభివృద్ధి శాఖ జిల్లా అధికారి అబ్దుల్ ఖయ్యూం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో 15 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటార న్నారు. పది, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ చేసిన యువతీ, యువకులు 18–30 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. ఎంపికైన వారు హైదరాబాద్, బెంగళూరు, తిరుపతిలో ఉద్యోగం చేయాల్సి ఉంటుంది. వేతనం నెలకు రూ. 10 వేల నుంచి రూ. 20 వేల వరకూ ఉంటుందిన్నారు. ఇంటర్వ్యూకు ఉదయం 10 గంటలకు హాజరుకావాలని, బయోడేటాతో పాటు ఆధార్ కార్డు, విద్యార్హత పత్రాలు తీసుకు రావాలన్నారు. మరిన్ని వివరాలకు 79815 41994 నెంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

టిడిపితోనే రహదారుల అభివృద్ధి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

రూరల్ మండలంలోని అమగొండపాలెం రహదారిని అభివృద్ధి చేసిన ఘనత టిడిపికే దక్కుతుందని శనివారం జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ సెల్ఫీ ద్వారా ప్రజలకు చూపారు. ఆయన మాట్లాడుతూ ఆ గ్రామానికి వెళ్లడానికి వీలులేని రహదారిని టిడిపి హయాంలో మంత్రి పల్లె రఘునాథరెడ్డి అభివృద్ధి చేశారన్నారు. రాష్ట్రంలో జాతీయ, రాష్ట్ర రహదారులు, జిల్లా, మండల కేంద్రాలను అనుసంధానించే రహదారులను వేగంగా అభివృద్ధి చేశారన్నారు. జాతీయ రహదారుల అభివృద్ధి, విస్తరణకు చొరవ చూపించిందన్నారు. భూ సేకరణతో పాటు ఏ సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ రహదారుల నిర్మాణం వేగవంతం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి అమ్మినేని కేశవనాయుడు, బేకరీ నాయుడు, సుధాకర్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వివాహిత దుర్మరణం

బత్తలపల్లి : ముదిగుబ్బ మండలం సంకేపల్లి గ్రామ సమీపంలోని వీరనారాయణస్వామి పరుషకు ద్విచక్ర వాహనంలో వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురై ఓ మహిళ మృతి చెందిన సంఘటన శనివారం మండలం లోని కట్టకిందపల్లి గ్రామం వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దెల గ్రామానికి చెందిన పార్నపల్లి మారుతి, శైలజ(29) దంపతులు సంకేపల్లి గ్రామ సమీపంలో జరిగే వీరనారాయణస్వామి పరుషకు ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. వీరు కట్టకిందపల్లి గ్రామం వద్ద వెళ్తుండగా జాతీయ రహదారిపై మరో ద్విచక్రవాహనం వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శైలజ తలకు బలమైన గాయాలు కాగా మారుతి స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు వారిని 108 వాహనంలో స్థానిక ఆర్‌డిటి ఆసుపత్రికి తరలించగా శైలజ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మారుతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రామాంజనేయులు తెలిపారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ప్రమాదవశాత్తూ చిన్నారి మృతి

పరిగి : స్థానిక సీతారాంపురం కాలనీలో తమిళనాడు నుంచి వలస వచ్చిన రామ్మూర్తి తినుబండారాల దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అతడికి భార్య, కూతురు ఇకిత(2) ఉన్నారు. రోజూ దుకాణంలో తినుబండారాలు తయారు చేసేవారు. శుక్రవారం రాత్రి కూడా ఇంట్లో తినుబండారాలు చేయగా మిగిలిన వేడినూనెను పాత్రలో ఉంచారు. ఇఖిత ఆడుకుంటూ వేడిగా ఉన్న నూనెలో కూర్చోవడంతో తీవ్రంగా గాయపడింది. గమనించిన తల్లిదండ్రులు వెంటనే అప్రమత్తమై చిన్నారిని హిందూపురం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తమిళనాడులోని క్రిష్ణగిరి ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ చిన్నారి మృతిచెందింది. ఈ విషయాన్ని స్థానిక పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా చిన్నారి ప్రమాదవశాత్తూ మృతి చెందినట్లు, తండ్రి రామ్మూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ వెంకటేశులు తెలిపారు.